ప్రజారోగ్యానికి పెద్దపీట

- అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష
- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపు


మల్లిసాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


మల్లేపల్లి వైద్య శిబిరంలో రోగుల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటిబాబు

గోకవరం/జగ్గంపేట/గండేపల్లి/కిర్లంపూడి/ఏలేశ్వరం/ప్రత్తిపాడు/తుని రూరల్/కోటనందూరు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరం మండలం మల్లవరం, జగ్గంపేట మండలం మల్లిసాల, గండేపల్లి మండలం మల్లేపల్లి సచివాలయం-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. శిబిరాల్లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదలకు ఖర్చు లేకుండా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికే ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. జిల్లా కేంద్రాల నుంచి స్పెషలిస్టు డాక్టర్లను తీసుకువచ్చి పరీక్షలు చేయిస్తున్నారన్నారు. తాత్కాలిక, దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఉచితంగా మందులు ఇస్తారని, అవసరమైన వారిని ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేస్తారని చెప్పారు. కంటి పరీక్షలు కూడా నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు, మందులు, ఐసీడీఎస్ స్టాల్ వద్ద పౌష్టికాహారం కిట్లను ఎమ్మెల్యే చంటిబాబు పంపిణీ చేశారు. గోకవరం మండలం మల్లవరం వైద్య శిబిరంలో 623 మంది వైద్య సేవలు పొందగా 39 మంది ఆరోగ్యశ్రీకి నమోదు చేసుకున్నారు. జగ్గంపేట మండలం మల్లిసాలలో రోగులను కాకినాడ జీజీహెచ్ నుంచి చంటిపిల్లల డాక్టర్ బుర్రి రాంబాబు, గైనకాలజిస్టు డాక్టర్ తిరుమలదేవి, రాజపూడి పీహెచ్‌సీ వైద్యుడు శ్రీరామ్, కాట్రావులపల్లి పీహెచ్‌సీ వైద్యుడు రాజశేఖర్, జగ్గంపేట సీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.తేజ పరీక్షించారు. గోకవరం మండలం మల్లవరంలో జరిగిన కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, వైస్ ఎంపీపీ గోకాడ చిట్టిబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్ కుమార్, ఎంపీడీఓ పద్మాజ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. జగ్గంపేట మండలం మల్లిసాలలో జరిగిన శిబిరంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావుకాపు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వుయ్యూరి నాని, సర్పంచ్ సర్వసిద్ధి సూకరత్నం, ఎంపీడీఓ వసంతకుమార్, తహసీల్దార్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. గండేపల్లి మండలం మల్లేపల్లిలో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, ఎంపీడీఓ వి.రామన్, తహసీల్దార్ వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో వైస్ సర్పంచ్ పాతంశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యాన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని 462 మంది రోగులకు వైద్య సిబ్బంది పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 19 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రులకు రిఫర్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఆశపు బద్రి, తహసీల్దార్ కేవీ మాధవరావు, వైద్యులు అభిషేక్, జ్యోతి మణిమాల, హేమాంజలి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.
- ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురంలో జగనన్న ఆరోగ్య సురక్షను తహసీల్దార్ చిన్నారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో ఇంటికీ, ప్రతి కుటుంబానికీ వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్, సర్పంచ్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.
- ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ సమీక్ష నిర్వహించారు. మండలంలో ఈ నెల 6 నుంచి జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్‌ఆర్ పవన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- ప్రత్తిపాడు మండలంలో ఈ నెల 6 నుంచి నవంబర్ 6వ తేదీ వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కుమార్‌బాబు తెలిపారు. ఎంపీడీఓ, తహసీల్దార్‌తో కూడిన రెండు బృందాలు ఈ శిబిరాలను నిర్వహిస్తాయి. ఎంపీడీఓ బృందం ఈ నెల 6న రాచపల్లి సచివాలయం-2, 9న బురదకోట, 11న పోతులూరు, 13న ప్రత్తిపాడు-1, 17న చింతలూరు, 19న గోకవరం, 21న ఉద్దండ జగన్నాథపురం, 25న వెంకటనగరం, 27న పెదశంకర్లపూడి, 30న ఉత్తరకంచి, నవంబర్ 1న ధర్మవరం-2, 3న ఒమ్మంగి-2, 6న ప్రత్తిపాడు-3 సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తాయి. తహసీల్దార్ బృందం ఈ నెల 7న గజ్జనపూడి, 10న ధర్మవరం-1, 12న లంపకలోవ, 16న చిన శంకర్లపూడి, 18న ఒమ్మంగి-1, 20న ఏలూరు-1, 26న ఏలూరు-2, 28న శరభవరం, 31న బురువువాక, నవంబర్ 2న ప్రత్తిపాడు-2, 4న ధర్మవరం-3 సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తాయి.
- తుని మండలం డి.పోలవరం సచివాలయం-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీలు చిటికెల సత్యవతి, చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు ప్రారంభించారు. రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, జేసీఎస్ కన్వీనర్ సకురు నాగేంద్ర నెహ్రూ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, ఎంపీడీఓ పి.రవికుమార్, ఎన్.సూరవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ఎస్ఎల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.
- కోటనందూరు మండలం అల్లిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ తరిపే చినతల్లితో కలసి ఎంపీపీ లగుడు శ్రీనివాసు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, లోవ దేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, కో ఆప్షన్ సభ్యుడు జిగటాల కోట సత్తిబాబు, సర్పంచ్ లెక్కల ఉపేంద్ర, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, తహసీల్దార్ కుశరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వసతి గృహ విద్యార్థినులకు వైద్య పరీక్షలు

గోకవరం: వీరలంకపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల వసతి గృహం విద్యార్థినులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వసతి గృహంలో ఓ విద్యార్థిని అస్వస్థతకు గురి కావడంతో చికిత్స కోసం గోకవరం ప్రభుత్వాస్పత్రికి వచ్చింది. ఈ క్రమంలో వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ అయ్యిందంటూ సోషల్ మీడియాలో పుకార్లు రావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే డాక్టర్ అలేఖ్య ఆధ్వర్యాన సిబ్బంది ఆ వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎటువంటి ఫుడ్ పాయిజన్ జరగలేదని నిర్ధారించారు. నలుగురు విద్యార్థినులు సాధారణ అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నట్టు గుర్తించారు. అనంతరం భోజన శాలను సందర్శించి, విద్యార్థినులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శంకర్, రమ్య, ఏఎన్ఎంలు సూర్యకాంతం, పవన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సత్రం భూముల సర్వేపై కాలయాపన

గోకవరం: రంపయర్రంపాలెంలో అన్యాక్రాంతమైన సుందరమ్మ సత్రం భూముల సర్వేపై రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. ఆ సత్రం భూములను పరిరక్షించాలనే డిమాండుతో సంఘం ఆధ్వర్యాన గ్రామంలో మంగళవారం నిరసన తెలిపారు. సత్రం భూముల్లో ఇంకా 15 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని, దీనిపై రెవెన్యూ అధికారులు సర్వే చేసి, ఎండోమెంట్ అధికారులకు అప్పగించాలని వీరాంజనేయులు అన్నారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ నాయకులు దేశెట్టి సురేష్, గుడిసె చెల్లారావు, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: సమస్యల పరిష్కారంపై అధికారులు శ్రద్ధ చూపాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత సమావేశంలో వచ్చిన సమస్యలపై ఆయా శాఖల అధికారులు ఎటువంటి పరిష్కారం చూపలేదని అన్నారు. సమావేశాలకు అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని అన్నారు. మండల అభివృద్ధి నిధుల వినియోగంపై సభ్యులందరూ కలసి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జిల్లా ఖోఖో జట్లకు ఎంపిక

తుని రూరల్: జిల్లా జూనియర్ ఖోఖో జట్లకు తుని మండలం వి.కొత్తూరు ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత మంగళవారం ఈ విషయం తెలిపారు. గత నెల 28న కాకినాడ జేఎన్‌టీయూ క్రీడా మైదానంలో జిల్లా జట్టు ఎంపిక జరిగిందన్నారు. బాలికల విభాగంలో తోట శాంతి (బీకాం), బాలుర విభాగంలో సీహెచ్ రోహిత్ (బీకాం) ఎంపికయ్యారని వివరించారు. ఇద్దరినీ ప్రిన్సిపాల్ లలిత, హెచ్ఓడీ బి.నాగరాజు, పీడీ ఎస్.రాజేష్ కుమార్ మెరిట్ సర్టిఫికెట్లతో అభినందించారు.

చురుగ్గా ఆలయ నిర్మాణం


ఆలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్

తొండంగి: గోపాలపట్నంలో దుర్గా మాత ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామ శివారున సర్పంచ్ కటకం శివ ఆధ్వర్యంలో సుమారు రూ.15 లక్షల అంచనాతో ఈ ఆలయం నిర్మిస్తున్నారు. శ్లాబ్ వరకూ పనులు జరిగాయి. ఆలయ ప్రాకార మండపం తదితర పనులు జరగాల్సి ఉంది. దాతల సహకారంతో కార్తిక మాసం నాటికి ఈ ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని సర్పంచ్ శివ తెలిపారు. త్వరలోనే విగ్రహ ప్రతిష్ఠకు కూడా కృషి చేస్తున్నామని చెప్పారు.

నేడు మండల సమావేశం

గండేపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ప్రజారోగ్యానికి భరోసా కల్పించడమే లక్ష్యం

ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్


కత్తిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్

శంఖవరం: ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని కత్తిపూడిలో సచివాలయం-1లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రజలకు వైద్య సేవలు అందించి, మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం స్థానిక నారాయణస్వామి కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ప్రజలకు అన్ని విధాలా మేలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, సర్పంచ్ కొల్లు వెంకట సత్యనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, ఎంపీటీసీ చల్లా సత్యప్రసాద్, జీలకర్ర విష్ణు, వైఎస్సార్ సీపీ నాయకుడు దడాల బాబ్జీ, వైద్యులు రాజీవ్, సౌమ్యశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తేజ, కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అటవీ నేర పరిశోధనలో నైపుణ్యాలు పెంచుకోవాలి


అటవీ శాఖ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న రేంజర్ కరుణాకర్

గోకవరం: అటవీ శాఖ సిబ్బంది అటవీ నేర పరిశోధనలో నైపుణ్యాలు పెంచుకోవాలని ఫోక్సుపేట రేంజర్ ఎం.కరుణాకర్ అన్నారు. అటవీ నేరాల్లో సాక్ష్యాధారాలను సేకరణలో మెళకువలపై సూదికొండ గ్రామంలోని ఫోక్సుపేట అటవీ శాఖ కార్యాలయంలో సిబ్బందికి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 75వ వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో కరుణాకర్ మాట్లాడుతూ, వన్యప్రాణి నేరాలను గుర్తించడంతో పాటు నేర నిరూపణకు ఉపయోగపడే సాక్ష్యాలను సిబ్బంది సంపాదించాలని, తద్వారా అటవీ సంపదను కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ సుజాత, సెక్షన్ ఆఫీసర్లు సూకరాజుదొర, అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- రూ.34 లక్షలతో రహదారి పటిష్టత పనులకు శంకుస్థాపన


సింహాద్రిపురం అడ్డురోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: రోడ్ల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. రూ.34 లక్షల డీఎంఎఫ్ నిధులతో మండలంలోని సింహాద్రిపురం అడ్డురోడ్డు నుంచి వెల్దుర్తి వెళ్లే 2.7 కిలోమీటర్ల రోడ్డు పటిష్టత పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ పనులు తక్షణం ప్రారంభించి, సకాలంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రోడ్డును అభివృద్ధి చేయాలంటూ గ్రామస్తులు గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. విషయం తన దృష్టికి రావడంతో సీఎస్ఆర్, మైనింగ్ ఫండ్స్ కేటాయించి సింహాద్రిపురం రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన చేశామని చెప్పారు. మరో రూ.86.56 లక్షల నాబార్డు నిధులతో బీటీ రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదించామన్నారు. అనంతరం వేలంకలో రూ.20 లక్షల జీజీఎంపీ నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే చంటిబాబు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాలపురెడ్డి పాపయమ్మ, ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యులు తోట విష్ణు, డీఈ యు.ఉమాశంకర్, జేఈ గంగాధర్, పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పని చేస్తున్న ప్రభుత్వం


తుని 19వ వార్డులో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీ సుధారాణి, బాలు

తుని: గతంలో అధికారం వస్తే ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రభుత్వాన్ని చూశారని, ఇప్పుడు ప్రజల కోసం పని చేస్తున్న ప్రభుత్వాన్ని చూస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 19వ వార్డులో కౌన్సిలర్ ఆచంట సురేష్ ఆధ్వర్యాన 'మన మున్సిపాలిటీ-మన బాధ్యత' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పరంగా అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పట్టణాభివృద్ధికి అవసరమైన నిధులను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రభుత్వం నుంచి తీసుకువస్తున్నారని, వీటితో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని సుధారాణి చెప్పారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిష్కరించాలని కమిషనర్ ప్రసాదరాజును సుధారాణి ఆదేశించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, ఆర్యవైశ్య ప్రముఖులు పేరూరి కృష్ణ, దాసరి బాబ్జీ, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, వైఎస్సార్ సీపీ తుని పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్ఆర్‌యూసీ సభ్యుడు బోడపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దూరమైనా.. చేరువై..


కాకినాడ ఆసుపత్రిలో గణపతికి పింఛను అందిస్తున్న వలంటీర్ పద్మ

జగ్గంపేట: కాట్రావులపల్లికి చెందిన వృద్ధుడు బొండపల్లి గణపతి కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాట్రావులపల్లి సచివాలయం-1 వలంటీర్ రాగం పద్మ కాకినాడ వెళ్లి మరీ ఆయనకు వృద్ధాప్య పింఛను అందించారు. దీనిపై గణపతి ఆనందం వ్యక్తం చేశారు. వలంటీర్ పద్మను వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అభినందించారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఎంపిక

అన్నవరం: అండర్-14 రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు ఎంపికకు మంగళవారం తునిలో నిర్వహించిన పోటీల్లో స్థానిక శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు ఆరుగురు ఎంపికయ్యారు. కరస్పాండెంట్ పి.హరిప్రసాద్, హెచ్ఎం టి.శివకుమార్ ఈ విషయం తెలిపారు. మొత్తం 150 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. శ్రీ సత్యసాయి విద్యావిహార్‌కు చెందిన పి.అఖిల్, ఎం.విజయ్‌కుమార్, టి.వేంకట నాగ సత్యనారాయణ, ఎ.నవ్యశ్రీ, కె.గంగాలక్ష్మి, జి.నాగదేవి మంజుల ఎంపికయ్యారని వివరించారు. వారు ఈ నెల 16, 17 తేదీల్లో గుంటూరు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టెన్నిస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు, కార్యదర్శి గంటా విక్టర్‌బాబు, తుని వ్యాయామ ఉపాధ్యాయ సంఘ సమన్వయకర్త ప్రసన్నకుమార్, కరస్పాండెట్ హరిప్రసాద్, హెచ్ఎం శివకుమార్ అభినందించారు.

రైతులకు మేలు చేయడమే లక్ష్యం కావాలి


సొసైటీ డైరెక్టర్లను సన్మానిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా పీఏసీఎస్ డైరెక్టర్లు పని చేయాలని సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు అన్నారు. ఒమ్మంగి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) డైరెక్టర్లుగా అటికే సత్యనారాయణ, బర్రే రామకృష్ణ, సుంకర సూరిబాబు (దత్తుడు), వీహెచ్ఏ భవాని, వీఏఏ శ్రీదేవి నూతనంగా బాధ్యతలు చేపట్టారు. వారిని చైర్మన్ కొప్పన గంగారావు, కార్యదర్శి నిమ్మల గణేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చినబాబు ఘనంగా సత్కరించారు.

లయన్స్ క్లబ్ సేవలు శ్లాఘనీయం


గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఆర్ఎంఓ కన్యాకుమారి

ప్రత్తిపాడు: లయన్స్ క్లబ్ ప్రత్తిపాడు సభ్యుల సేవలు శ్లాఘనీయమని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంఓ) ఎం.కన్యాకుమారి కొనియాడారు. సీహెచ్‌సీకి వైద్య పరీక్షల కోసం ప్రతి నెలా సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న గర్భిణులకు లయన్స్ క్లబ్ సభ్యులు పౌష్టికాహారం అందిస్తున్నారు. మారిశెట్టి సూర్యప్రకాష్ తన పుట్టిన రోజు సందర్భంగా గర్భిణులకు మంగళవారం పౌష్టికాహారం సమకూర్చారు. దీనిని ఆర్ఎంఓ కన్యాకుమారి 62 మంది గర్భిణులకు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంజినీర్ బి.మోహన్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రస్తుత ఏడాది డైరీలను క్లబ్ అధ్యక్షుడు మోహన్ పంపిణీ చేశారు.

ఘనంగా ఆర్‌పీఐ ఆవిర్భావ దినోత్సవం

జగ్గంపేట: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం జగ్గంపేటలో ఘనంగా నిర్వహించారు. ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు జుత్తుక నాగేశ్వరరావు అధ్యక్షతన స్థానిక కోళ్లఫారం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు నేతలు మాట్లాడుతూ, అంబేడ్కర్ స్థాపించిన తమ పార్టీ ఆశయాలను వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ సౌతిండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులి ప్రసాద్, దళిత ప్రజాశక్తి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మురారి రవికుమార్, మాల మహానాడు జిల్లా కార్యదర్శి సూకతట్టు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భోజనం ప్యాకెట్ల పంపిణీ

జగ్గంపేట: పురాణపండ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన జగ్గంపేటలో యాచకులు, పేదలు, రాజస్థాన్ కార్మికులకు మంగళవారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ శేషసాయిశర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తలుపులమ్మ తల్లి జాతర

కోటనందూరు: మండలంలోని కేఏస్ కొత్తూరులో తలుపులమ్మ తల్లి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. గ్రామ శివారున కొలువై ఉన్న అమ్మవారిని వేలాదిగా భక్తులు దర్శించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, చిడతలు, బాణసంచా కాల్పులు అలరించాయి. ఎంపీటీసీ సభ్యులు దొగ్గా రామకృష్ణ, పైల వీరాంజనేయులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలవరం కాలువ ఆక్రమణలను అడ్డుకోవాలి

జగ్గంపేట: స్థానిక గోకవరం రోడ్డులోని పోలవరం కాలువ ఆక్రమణలను అడ్డుకోవాలనే డిమాండుతో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ, పోలవరం కాలువను చాలా మంది ఇష్టానుసారం ఆక్రమించి, నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పోలవరం కాలువపై ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు పూరి గుడిసెలు వేసుకుంటే పోలీసుల సహకారంతో ఇరిగేషన్ అధికారులు వెళ్లగొట్టారని అన్నారు. ఇప్పుడు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవటం లేదని విమర్శించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ విజృంభణ జిల్లా కార్యదర్శి కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడులు.. ముగ్గురి అరెస్టు


పెదశంకర్లపూడిలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

ప్రత్తిపాడు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు వివిధ గ్రామాల్లో మంగళవారం దాడులు చేసి, ముగ్గురిని అరెస్టు చేశారు. ఎస్ఈబీ సీఐ పి.అశోక్ కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి అటవీ ప్రాంతంలో సారా బట్టీపై దాడి చేసి, 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పెదశంకర్లపూడికి చెందిన సూరంపూడి శ్రీనుపై పరారీ కేసు నమోదు చేశారు. ఏలేశ్వరం మండలం సిరిపురంలో ఐదు లీటర్ల సారాతో కోట లక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. పెదశంకర్లపూడి, ఏలేశ్వరాల్లో నల్లబెల్లం సరఫరా కేసులో పరారైన కోరుప్రోలు గోపాలకృష్ణ, గెడ్డద బాలరాజులను అరెస్టు చేశారు. ఈ దాడుల్లో స్థానిక ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు, హెచ్‌సీ వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు ప్రింటర్ బహూకరణ


ప్రిన్సిపాల్‌కు ప్రింటర్ అందజేస్తున్న రామ్‌కుమార్

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ మంగళవారం ప్రింటర్ బహూకరించారు. సుమారు రూ.20 వేల విలువైన ప్రింటర్‌ను పార్టీ శ్రేణులతో ప్రిన్సిపాల్ కె.బాబ్జీకి అందజేశారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ, చార్టర్డ్ అకౌంటెంట్‌గా, చాలా కంపెనీలకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా పని చేసిన తాను వచ్చిన ఆదాయంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గట్టిం వెంకటరమణ, దాకే కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.